అటవీశాఖ అధికారులపై
చర్యలు తీసుకోవాలి 6
- చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్

సెప్టెంబరులో పీయూ స్నాతకోత్సవం
» పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ 7

'భారత్‌మాల' రోడ్డు పనుల అడ్డగింత
» పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన 7


గంగిమాన్‌దొడ్డి వద్ద నిర్మాణం అవుతున్న భారత్‌మాల పనులను అడ్డుకున్న రైతులు

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద
» ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి 6


శ్రీశైలం జలాశయం

చేతివాటం

» ధాన్యం రవాణా పేరుతో దోపిడీ
» లారీ డ్రైవర్లతో కుమ్మక్కైన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు
» ఒక సంచికి రూ.2 నుంచి రూ.3 వసూలు
» డబ్బులు ఇచ్చిన వారి ధాన్యానికి మొదటి ప్రాధాన్యం
» అడిగిన కాడికి చేతులు తడుపుతున్న రైతులు
» మిల్లుల వద్ద వసూలు చేస్తున్న హమాలీలు


వనపర్తి మార్కెట్ యార్డులో లారీల్లోకి ధాన్యాన్ని ఎత్తుతున్న హమాలీలు

వనపర్తి, మే 27(ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక వైపు తేమ శాతం పేరుతో ప్రతీ 40 కిలోల బస్తాకు 3 నుంచి 5 కిలోల కోత విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు వచ్చే ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు రైతుల నుంచి ముడుపులు తీసుకుంటున్నారు. ఒక్కొక్క సంచికి రూ.2 నుంచి రూ.3 వరకు వసూలు చేస్తున్నారు. సుమారుగా ఒక ట్రిప్పుకు 450 నుంచి 720 బస్తాలు తరలిస్తుంటారు. సుమారు రూ.1,000 నుంచి రూ.1500 కమీషన్ తీసుకుంటున్నారు. డబ్బులు ఇవ్వని పక్షంలో రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చేసేదేమీ లేక రైతులు అడిగినంత ఇచ్చి ధాన్యం లారీలకు ఎత్తుతున్నారు.

తూకం వేసే వరకే రైతు బాధ్యత

నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి కాంట వేయడం వరకే రైతుల బాధ్యత. ఆ తరువాత లారీల్లో లోడ్ చేసుకుని కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు తరలించే బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే తీసుకోవాలి. అయితే వారంరోజులుగా వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా భావించి లారీ డ్రైవర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ధాన్యం తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు కానీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎవరైనా రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. డ్రైవర్లు ప్రతీ బస్తాకు కమిషన్ తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాల్సి వస్తుంది. రైతులు నేరుగా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- జగన్మోహన్, సివిల్ సప్లయ్ అధికారి


పెబ్బేరు మండలం చెలిమిళ్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యపు కుప్పలు

అంతరాలు లేని చదువులు కావాలి

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తెలకపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : అంతరాలు లేని చదువు కావాలని తెలంగాణ పౌరస్పందన వేదిక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, ప్రభుత్వ విద్యా సంస్థలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. మంగళవారం తెలకపల్లి బస్టాండ్ సెంటర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ చదువుల్లో మార్పు రావాలని, ధనికుల పిల్లలైనా, పేదల పిల్లలైనా ఒకే బడిలో చదువుతుంటే అంతరాలు లేని సమాజం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, తిరుమలేష్, జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్‌లు పాల్గొన్నారు.

వానాకాలం.. ప్రణాళిక సిద్ధం

» నాగర్‌కర్నూల్ జిల్లాలో 5,38,462 ఎకరాల విస్తీర్ణంలో సాగు అంచన
» పత్తి, మొక్కజొన్న పంటలకు అధిక ప్రాధాన్యం
» ముందస్తు వర్షాల రాకతో సాగుకు సిద్ధమైన రైతులు


వానాకాలం సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

అచ్చంపేట, మే 27(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయశాఖ ఇప్పటికే వానాకాలంలో పండించే పంటలపై పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేసింది. జిల్లాలో గత ఏడాది వానాకాలంలో 4,35,692 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఈ ఏడాది వానకాలంలో 5,38,462 ఎకరాలలో సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జిల్లాలో 1,02,070 ఎకరాల సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రధానంగా ఈ ఏడాది పత్తి 2,86,471 ఎకరాలు సాగు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలకు సంబంధించి విత్తనాలు 50,173 క్వింటాళ్లు అవసరమవుతాయనే అంచనాతో పూర్తిస్థాయిలో విత్తనాలు అందుబాటులో ఉంచారు. వానకాలంలో 99,150 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఈ నెల 26 నాటికి 14,526 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, 84,624 మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉందని తెలిపారు.

ఎరువు రకం	వానాకాలానికి అవసరమైన ఎరువులు	అందుబాటులో ఉన్న ఎరువులు మెట్రిక్ టన్నులలో
యూరియా	40,000	7,871
డీఏపీ	13,000	1,904
ఎంఓపీ	4,350	345
ఎస్ఎస్‌పీ	1,800	604
కాంప్లెక్స్	40,000	3,802
మొత్తం	99,150	14,526

వానాకాలం సాగు ప్రణాళిక

పంట రకం	2025 వానాకాలం సాగు విస్తీర్ణం	విత్తనాలు క్వింటాళ్లలో..
పత్తి	2,86,471	2865
వరి	16,021	40,000
కందులు	8,909	267
మొక్కజొన్న	72,929	5,834
జొన్నలు	7,822	313
మినుములు	368	10
ఆముదాలు	239	26
వేరుశనగ	895	850
ఇతర పంటలు	808	8
మొత్తం	5,38,462	50,173

నాలుగేళ్లుగా ఎదురు చూపులు
» కులాంతర వివాహ జంటలకు అందని ప్రోత్సాహకం
» నిధుల విడుదలలో తీవ్ర జాప్యం 7



నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ 6



సర్వేకు సహకరించాలి
» భూమిని కోల్పోయే రైతులకు నష్ట పరిహారంతో పాటు, ఉపాధి కోసం సాయం అందిస్తాం
» రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్
» తిప్రస్‌పల్లి, బాపూర్, పెద్దపొర్ల గ్రామాల్లో రైతుల పునరావాస గ్రామసభ 7

పోడు భూములకు పట్టాలివ్వాలి

- ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేసిన ఆదివాసులు
- సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తా : అచ్చంపేట ఆర్డీవో మాధవి


అచ్చంపేట ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న చెంచు రైతులు

అచ్చంపేటటౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పోడు భూములకు పట్టాలివ్వాలని అచ్చంపేట ఆర్డీవో కార్యాలయం ముందు మంగళవారం ఆదివాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా నల్లమల ప్రాంతంలో సాగుచేస్తున్న భూములను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎన్నికల ముందు చెంచుల సమస్యలు పరిష్కారిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోడు భూములకు పట్టాలివ్వాలని చెబుతున్నా అధికారులు చొరవచూపడం లేదన్నారు. నల్లమల ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా సాగుచేస్తున్న భూములను అధికారులు పరిశీలించి పట్టాలు ఇవ్వాలని కోరారు. హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చినా అటవీశాఖ అధికారులు విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చెంచు రైతులతో ఆర్డీవో మాధవి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాతల కాలం నుంచి సాగులో ఉన్న భూములను అపడంలేదని తెలిపారు. కొత్తగా సాగుచేస్తున్న భూముల విషయంపై త్వరలో అధికారులు విచారణ జరిపి అర్హులందరికీ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, లింగాల, బల్మూరు, అచ్చంపేట మండలాలోని పుల్‌తీగలబండ తండా, చక్రీకబండతండా, బొమ్మన్‌పల్లి, ఐనోల్, అప్పాపూర్, రాంపూర్, పలు చెంచుపెంటల నుంచి చెంచు రైతులు నల్లపోతుల పెద్దిరాజు, చంద్రయ్య, దాసరిముత్యాలు, దాసరి నర్సింహ్మా, నిమ్మల లింగస్వామి అంజి, వివిధ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని తడవనివ్వొద్దు..

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని తడవనివ్వొద్దని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్‌లు కప్పి ఉంచాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా త్వరగా తూకం చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ గోదామును పరిశీలించారు. గోదాములో ఉన్న పాత గన్నీ బ్యాగులను ఇక్కడి నుంచి తరలించాలని సూచించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని భూ భారతి ప్రాజెక్టుపై ఆరా తీశారు. భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న గోపాల్‌పేట మండలంలో వచ్చిన దరఖాస్తులు జూన్ 2లోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, తహసీల్దార్ పాండు నాయక్, డీటీ తిలక్‌రెడ్డి, ఇతర సిబ్బంది సమీక్షలో పాల్గొన్నారు.


గోపాల్‌పేట గోదాములో పాత గన్నీబ్యాగులను పరిశీలిస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

రైతులను మోసం చేస్తే చర్యలు

- విత్తన దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్


నాగర్‌కర్నూల్ పట్టణంలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ ఫర్టిలైజర్ షాపును మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో దుకాణంలో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, రైతులకు విక్రయిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయశాఖ అధికారుల నిబంధనలను దుకాణదారులు పాటించాలని, మండల గ్రామ స్థాయిలో ప్రత్యేక స్పెషల్ టాస్క్‌ఫోర్సు కమిటీలు నిరంతరం తనిఖీలు చేస్తారని, రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ :
9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

HOUSE FOR SALE
★ "INDEPENDENT HOUSE SALE" East Facing 2 BHK 185 sqyds at Jedcharla. Mobile: 9886154400 AJH-2246



పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఆత్మకూరు మండలంలోని జూరాల జెన్‌కో అతిథిగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లాలోని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయా పోలీస్ స్టేషన్‌లలో మే నెలలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పోలీసుల పనితీరును పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా ఉండాలని, ప్రతీ ఫిర్యాదును స్వీకరించి వారికి సత్వరమే న్యాయం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలు పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆత్మకూరు సీఐ శివకుమార్, కొత్తకోట సీఐ రాంబాబు, వనపర్తి సీఐ కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.



మక్తల్ మండలం అనుగొండలో ఆయిల్‌పామ్ విక్రయం కోసం తరలిస్తూ



మరికల్ మండలం జిన్నారంలో ఆయిల్‌పామ్ దిగుబడితో రైతు శ్రీపాద్‌రావు

ఆయిల్‌పామ్ పంట పండింది

- నాలుగేళ్ల తర్వాత చేతికి వస్తున్న దిగుబడి
- మక్తల్ కలెక్షన్ పాయింట్‌కు తరలింపు
- అశ్వారావుపేట ఆయిల్ కంపెనీకి విక్రయం
- నారాయణపేట జిల్లాలో 6,500 ఎకరాల్లో సాగు



మక్తల్ మండలం కర్నిలో రైతు అరోగ్యరెడ్డి అయిల్‌పామ్ తోటలో ఉద్యనశాఖ అదికారులు

నారాయణపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ రైతుల పంట పండింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 6,500 ఎకరాల్లో 1600 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 2019లో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల నుంచి ప్రస్తుతం దిగుబడి చేతికి అందుతోంది. ఆయిల్‌పామ్ గెలలను రైతులు జిల్లాలోని మక్తల్ మండల కేంద్రంలో ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి అధికారులు ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట అయిల్ కంపెనీకి విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 144 మంది రైతులు, 250 ఎకరాలకు సంబంధించి 366 టన్నుల ఆయిల్ పామ్ గెలలను కలెక్షన్ కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఎకరానికి 2 టన్నుల దిగుబడి వస్తుంది. ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాల తర్వాత ఎకరానికి 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. 2023లో క్వింటాలుకు రూ. 12 వేల ధర పలుకగా, ప్రస్తుతం క్వింటాలుకు రూ. 20,058 ధర వస్తోంది.

సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

అయిల్‌పామ్ సాగును ప్రభుత్వం పోత్సహిస్తోంది. జిల్లాలో 2019-20లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ పథకాన్ని ప్రారంభించినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ పథకం ద్వారా ఎస్‌సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90 శాతం, జనరల్ రైతులకు 80 శాతం సబ్సిడీపై అయిల్ పామ్ మొక్కలతో పాటు డ్రిప్ పరికరాలను అందిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకొని అధిక లాభాలు ఆర్జించాలని సూచిస్తున్నారు. సాగు చేసిన నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుందని, ఆ లోపు అంతర పంటలను సాగు చేసుకోవచ్చని చెప్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో 50 నుంచి 57 అయిల్ పామ్ మొక్కలను నాటుకోవచ్చు. నల్లరేగడి, ఎర్ర భూములు సాగుకు అనుకూలం. సాగు పెట్టుబడిగా ప్రభుత్వం ఎకరానికి రూ. 2100 చొప్పున అందిస్తుంది. అంతర పంటల సాగుకు మరో రూ.2,100 ఇస్తోంది. నాలుగేళ్ల వరకు ఈ పెట్టుబడి సాయం కొనసాగుతుంది.

ఏడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు



నేను ఎడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఇప్పటివరకు మూడు సార్లు గెలలు కోశాం. మొదటి సారి దిగుబడి సరిగా రాలేదు. 15 రోజుల తర్వాత 13 క్వింటాళ్లు, మరోసారి రెండు టన్నులు, ఇంకోసారి రెండు టన్నుల దిగుబడి వచ్చింది. లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మూడు ఎకరాల్లో కోతలు కొనసాగుతున్నాయి. కూలీల అవసరం లేకుండా నేను, నా భార్య ఇద్దరం పని చేసుకుంటున్నాం.

కాశీం,
పెద్దకడుమూరు, నర్వ మండలం

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



జిల్లాలో వచ్చే ఏడాది నాటికి 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. సాగుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీతో ఆయిల్‌పామ్ సాగు చేసుకొని రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చు.

చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నారాయణపేట

కురుమూర్తి వాసా గోవిందా...

- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- కురుమూర్తి క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి క్షేత్రానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమావాస్య సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర మైదానం భక్తులతో కిక్కిరిసింది. కురుమూర్తి వాసా గోవిందా.. గోవింద అంటూ భక్తుల నామస్మరణతో క్షేత్రం మారుమోగింది. స్వామి దర్శనానికి రాజగోపురం నుంచి కాంచన గుహ వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. స్వామికి దాసంగాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జాతర మైదానంలోని దుకాణాల వద్ద భక్తుల సందడి కనిపించింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

- జోగులాంబ గద్వాల జిల్లాలో పలుచోట్ల అన్నదానం
- బీచుపల్లిలో పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఎర్రవల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి బీచుపల్లిలోని కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈవో రామన్‌గౌడ్ పరిశీలించారు.

ఆదిశిలా క్షేత్రంలో..



లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు

మల్దకల్, మే 27 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లోని స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వాల్మీకి పూజారులు తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలకు స్వామివారి రథోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పురాతనమైన మల్దకల్ శ్రీతిమ్మప్ప స్వామి క్షేత్రానికి వేలాదిమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారని అన్నారు.

ఘనంగా పాగుంట వెంకన్న కల్యాణం



ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కేటీదొడ్డి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేటీదొడ్డి, వెంకటాపురం, నందిన్నె, చింతలకుంట తదితర గ్రామాల్లో మంగళవారం అమావాస్య సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెంకటాపురంలోని కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని అమావాస్య సందర్భంగా ఆలయ పెద్దలు, అర్చకులు ఘనంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

హ్యాండ్లూమ్ కంపెనీ పని తీరు అద్భుతం

- మక్తల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధ



అమరచింత చేనేత హ్యాండ్లూమ్ కంపెనీని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

అమరచింత, మే 27(ఆంధ్రజ్యోతి) : అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ పని తీరు అద్భుతంగా ఉందని మక్తల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధ అన్నారు. నారాయణపేట జిల్లా, అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీని మంగళవారం ఆమె పరిశీలించారు. చేతి మగ్గాలపై నేస్తున్న చీరలు, పట్టు వస్త్రాలు, కుట్టు మిషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లస్టర్ అభివృద్ధి, నేత కార్మికుల పనితీరు, ప్రభుత్వ సహకారం తదితరాలపై చిత్ర ప్రదర్శన ద్వారా సీఈవో చంద్రశేఖర్ ఆమెకు వివరించారు. అనంతరం గవినోళ్ల రాధ మాట్లాడుతూ ఇక్కడ తయారైన చీరలను ఈ-మార్కెట్ ద్వారా భారత దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా విక్రయిస్తుండటం మంచి పరిణామం అన్నారు. చైర్‌పర్సన్ వెంట నాయకులు గవినోళ్ల లక్ష్మారెడ్డి, కేశం శీలన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్



2006లో ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టా బుక్కులు చూపుతున్న సార్లపల్లి చెంచులు

దోమలపెంట, మే 27 (ఆంధ్రజ్యోతి) : చెంచు గిరిజనులు పోడు భూములను సాగు చేయకుండా అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, సార్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాసమొల్లబావి వద్ద ఆయన మాట్లాడారు. 2006లో అప్పటి ప్రభుత్వం రాసమొల్ల బావి వద్ద 10 చెంచు కుటుంబాలకు పోడు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. రెండు సంవత్సరాలుగా ఆ భూములను సాగు చేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అడవి నుంచి చెంచులను వెళ్లగొట్టేందుకే ఇలాంటి ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. తమ హక్కులను కాలరాస్తున్న అటవీశాఖ అధికారుల తీరుకు నిరసనగా బుధవారం శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాసమొల్లబావి వద్ద రాస్తారోకో చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చెంచులు బోడయ్య, పెద్దులు, మానయ్య, వెంకటయ్య, భయ్యన్న ఎల్లమ్మ, ఈదమ్మ, గురువమ్మ తదిత రులు పాల్గొన్నారు.

విషపూరితం అవుతున్న బీజేపీ ప్రభుత్వం

- పౌరహక్కుల సంఘం నాయకుడు జక్క బాలయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు జక్క బాలయ్య

అచ్చంపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రోజురోజుకూ విషపూరితం అవుతోందని పౌరహక్కుల సంఘం నాయకుడు జక్క బాలయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని మరింత నిర్వీర్యం చేస్తోందన్నారు. మనుషులను చంపడమే ఒక నేరమైతే, వారి మృతదేహాలను కుటుంబీలకు ఇవ్వకపోవడం, పైగా ప్రభుత్వమే దహనం చేయడం దారుణమన్నారు. ఈ సంఘటనతో ప్రభుత్వ స్వభావం హింసాత్మకమని మరోసారి రుజువైందన్నారు. ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది చనిపోయిన సంఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు పంబలి బాలయ్య, ఎడ్ల అంబయ్య, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, మురళి, వెంకటేశ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు..

మక్తల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని జక్లేర్ వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని ఓ వృద్ధుడు మరణించాడు. నర్వ మండలంలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు కొండారెడ్డి (60) మంగళవారం జక్లేర్ స్టేజీ వద్ద నిత్యావసర సరుకులు కొనుగోలు చేశాడు. అనంతరం 167వ నెంబరు జాతీయ రహదారిని దాటుతుండగా, రాయచూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన అతడు కొద్దిసేపటికే ప్రాణాలు విడిచాడు.

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద

- ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి



జూరాల జలాశయానికి చేరిన వరద

దోమలపెంట/అమరచింత, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులోని శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ఎగువనున్న సుంకేసుల ప్రాజెక్టు నుంచి 4,462 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. దీంతో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 10,404 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 4.758 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రస్తుతం ఎంజీకేఎల్ఐ కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మంగళవారం జలాశయంలో నీటి మట్టం స్వల్పంగా తగ్గింది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, ప్రస్తుతం 818.10 అడుగుల మేరకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను, 39.4343 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో 2.60 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు.

'జూరాల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలతో జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం 2.653 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరింది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో నీరు 5.684 క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.684 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిర్మాణ పనులు వేగవంతం చెయ్యాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్
- మద్దూరు మండలంలో విస్తృత పర్యటన



అప్పిరెడ్డిపల్లి నుంచి రెనివట్ల బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూరు, కొత్తపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. నారాయణపేట జిల్లా, మద్దూరు మండలంలో మంగళవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఎస్‌డీఎఫ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో చేపట్టిన బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు నారాయణపేట మండలం బండగొండ నుంచి మద్దూరు మండలం చెన్వార్ వరకు నిర్మాణంలో బీటీ రోడ్డును పరిశీలించారు. అనంతరం మోమిన్‌పూర్ బీటీ రోడ్డును పరిశీలించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆ తర్వాత మోమిన్‌పూర్ నుంచి నారాయణపేట మండలం గనిమోనిబండ, అభంగాపూర్, లింకు రోడ్డు, మద్దూరు నుంచి రెనివట్ల, రాళ్లబాయి, రెనివట్ల నుంచి మోమిన్‌పూర్ వరకు పూర్తయిన బీటీ రోడ్డును పరిశీలించారు. గడువులోపు పనులను పూర్తి చేయించాలని ఈఈ హీర్యానాయక్, ఏఈ విలోక్‌లను ఆదేశించారు. అలాగే కొత్తపల్లి మండలంలోని భూనీడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనాన్ని తనిఖీ చేశారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. మద్దూరు మండల కేంద్రంలో రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. విద్యాసంస్థల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. ముందు అనుకున్న ప్లాన్‌ను కొంత మార్చామని, నేలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పనులు ప్రారంభించలేదని కాంట్రాక్టర్ వివరించారు. ఇసుక కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నా, రావడంతో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఇసుక రవాణాకు ఆటంకం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మద్దూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కొనసాగుతున్న భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కల్వకుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి, పంజుగుల గ్రామాల్లో గర్భిణులకు మెడికల్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, శేఖర్‌గౌడ్, భీమయ్య, ఖాజా, నాగరాజు, రాములు, శ్యామ్, మల్లయ్య, పరశురాములు, సలాం, భాస్కర్, వెంకటయ్య, సత్యనారాయణ, రాములు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

క్రైం కార్నర్

మూడు సంవత్సరాల బాలికపై బాలుడి లైంగిక వేధింపులు

» కేసు నమోదు, నిందితుడి రిమాండ్

జడ్చర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మూడు సంవత్సరాల బాలికపై ఓ బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మునిసిపాలిటీలో చోటు చేసుకున్నది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి మూడు సంవత్సరాల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 15 సంవత్సరాల బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అది గమనించిన తల్లిదండ్రులు బాలికను చికిత్స కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జరిగిన సంఘటనపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను ఆసుపత్రిలో అబ్జర్వేషన్‌లో ఉంచిన పోలీసులు అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై అత్యాచారయత్నంతో పాటు పోక్సో కేసు నమోదు చేశారు. జువైనల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



అబ్దుల్లా (ఫైల్)

వనపర్తి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అబ్దుల్లా (48) అనే వ్యక్తి గేదెల పెంపకంతో తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాడు. కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు రోజురోజుకు పెరిగి రూ. 10 లక్షలు అయ్యాయి. వాటిని తీర్చే మార్గంలేక మనస్తాపం చెందాడు. ప్రతీరోజు మాదిరిగానే తెల్లవారుజామున అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుడి భార్య పార్వతమ్మ గుర్తించి ఇంటి చుట్టుపక్కల వారిని తీసుకొచ్చేసరికి మృతి చెందాడు.

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

పాన్‌గల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేతేపల్లికి చెందిన శివ(21) హైదరాబాద్‌లో కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 24న హైదరాబాద్ నుంచి స్వగ్రామం కేతేపల్లికి వచ్చాడు. 25న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. చుట్టుపక్కల బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మహంకాళి ఫోన్ చేసి గ్రామ శివారులో ఎర్ర కురుమయ్య వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తి వేప చెట్టుకు బెల్టుతో ఉరి వేసుకుని చనిపోయినట్లు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా.. శివగా గుర్తించారు. ఘటనపై తండ్రి నాగేంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో వాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా

» చిన్నారి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన శ్రీవాణి (ఫైల్)

హన్వాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న బొలెరో, ఆటో ఢీకొని బోల్తా పడటంతో ఓ చిన్నారి మృతి చెందింది. మరో వృద్ధురాలు, డ్రైవర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ (65) మనవరాలు శ్రీవాణి (9)తో కలిసి ఆటోలో వేపూరు నుంచి హన్వాడకు బయలుదేరారు. అమ్మాపూర్‌తండా సమీపంలోని మలుపు వద్ద, చిన్నదర్పలికి చెందిన బొలెరో వాహనం హన్వాడ నుంచి వేపూర్ వైపునకు అతి వేగం గా వస్తూ ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటో రెండు మూడు పల్టీలు కొట్టడం తో అవ్వ, మనమరాళ్ల తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబు లెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో శ్రీవాణి మృతి చెందింది. వృద్ధురాలు వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ బాలరాజుకు కూడా గాయాలయ్యాయి. చిన్నారి శ్రీవాణి రామన్నపల్లి పాఠశాలలో 4వ తరగతి చదువుకుంటోంది. ఇటీవల గురుకుల పాఠశాల ప్రవేశం కోసం పరీక్ష రాసినట్లు ఉపాధ్యాయుడు మల్లేశ్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పుట్టింటికి వెళ్లి వస్తానని... ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నవాబ్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పుట్టింటికి వెళ్లి వస్తానని భర్తకు చెప్పి ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ ఇంటికి తిరిగి రాలేదు. మహబూబ్‌నగర్ మండలం, బోయపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన స్వప్నకు బోయపల్లికి చెందిన కొండయ్యతో వివాహం జరిగింది. వారికి కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 18న స్వప్న తన తల్లిగారి ఊరు కామారం గ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరింది. ఈ నెల 22న కొండయ్య అక్కడకు వెళ్లి విచారించగా వారు హైదరాబాద్‌లోని బంధువుల వద్ద ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమెను స్వగ్రామానికి తీసుకొచ్చాడు. కానీ తాను తల్లిగారింటికి వెళ్తున్నానని చెప్పి పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. తన భార్య ఓ అపరిచిత వ్యక్తితో కలిసి వెళ్లిపోయిందని కొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని.. ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి

తెలకపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం లేని పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, ఓ యువతి (24) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన యువతి హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. కుటుంబ సభ్యులు ఇంటికి రమ్మని పిలవడంతో సోమవారం నాగర్‌కర్నూల్‌లోని తమ ఇంటికి వచ్చింది. ఈ సందర్భంగా పెళ్లి చూపుల కోసం బంధువులు వస్తున్నారని తెలుసుకున్న ఆ యువతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. యువతికి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై కొడుకుల దాడి

గండీడ్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పంపకాల విషయంలో తండ్రీకొడుకులు గొడవ పడి, తండ్రిని గాయపరచడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కొడుకులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. లింగాయిపల్లి గ్రామానికి చెందిన దిడ్డి చెన్నయ్యకు పెద్ద మొగులయ్య, చంద్రయ్య ఇద్దరు కొడుకులు. ఇరువురు ఆస్తి పంపకాల విషయంలో తండ్రితో గొడవకు దిగగా, అడ్డువచ్చిన తల్లితో పాటు తండ్రి చెన్నయ్యను కొట్టారు. ఈ ఘటనలో గాయపడిన తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇరువురికి కొడుకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగేళ్లుగా ఎదురుచూపులు

» కులాంతర వివాహ జంటలకు అందని ప్రోత్సాహకం

» నిధుల విడుదలలో తీవ్ర జాప్యం



మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 27 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రోత్సాహకం అందడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భద్రత కల్పించడం, సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించడమే లక్ష్యంగా ప్రోత్సాహకం అందిస్తోంది. గతంలో రూ. 50 వేలు ఇచ్చేవారు. ఆ ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. 2019, నవంబరు ఒకటిన ప్రోత్సాహకాన్ని రూ. 2.50లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నా, లబ్ధిదారులకు నగదును అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో విమర్శలు వస్తున్నాయి. దాదాపు నాలుగేళ్లుగా నిధులు మంజూరు కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నిధులు మంజూరు కాలేదని, వస్తే ఇస్తామని సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాజంలో వస్తున్న మార్పు

మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కులాంతర వివాహాలు పెరుగుతున్నాయి. కులంపై గతంలో ఉన్న పట్టింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గతంలో కులంలోనే పెళ్లిళ్లు జరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. కులం ప్రాధాన్యం తగ్గిపోయి ఇతర అంశాల వైపు దృష్టి సారిస్తున్నారు. కులం ఏదైనా అభిప్రాయాలు, అభిరుచులు కలిస్తే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటున్నారు. అలాగే పెద్దలు కూడా పట్టింపులను వదిలేసి సర్దుకుంటున్నారు. కొందరు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయించి వివాహం చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వం ద్వారా అందే సాయం వారికి ఆర్థిక భద్రత కల్పిస్తోంది. కానీ సకాలంలో డబ్బు అందకపోవడంతో ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కులాంతర వివాహం చేసుకున్న వారికి సకాలంలో ప్రోత్సాహకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రోత్సాహకానికి అర్హుల వీరే ...



- పెళ్లి చేసుకున్న దంపతుల్లో ఒకరు తప్పనిసరిగా షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందిన వారు ఉండాలి.
- యువతికి 18 ఏళ్ల వయసు, యువకుడికి 21 ఏళ్ల వయసు ఉండాలి. వివాహచట్టం 1965 కింద నమోదు అయి ఉండాలి. .
- పెళ్లి చేసుకున్న జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కన్నా తక్కువ ఉండాలి
- మొదటి వివాహం అయిన వారికి మాత్రమే పోత్సాహకం ఇస్తారు.
- వివాహం అయిన ఏడాదిలోపు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేసుకోవడం ఇలా ...

వేర్వేరు కులాలకు చెందిన యువతీ యువకులు పెళ్లి చేసుకుంటే, సంబంధిత ఆధారాలతో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి అర్హులను గుర్తించి, ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. దీని ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. వాటిని కులాంతర వివాహం చేసుకున్న జంటలకు అందిస్తారు.

32 జంటలకు మాత్రమే ప్రోత్సాహకం

మహబూబ్‌నగర్ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 122 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వారిలో 32 జంటలకు మాత్రమే నగదు అందింది. మిగతా వారు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారు. నారాయణపేట జిల్లాలో 79 జంటలు దరఖాస్తు చేసుకోగా, 34 మందికి ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 45 జంటలకు నగదు అందాల్సి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 154 జంటలు దరఖాస్తు చేసుకోగా, 11 జంటలకు మాత్రమే పోత్సాహకం మంజూరయ్యింది. మరో 143 మంది నగదు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

నిధులు వచ్చిన మేరకు అందిస్తున్నాం

కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం పోత్సాహకం అందిస్తోంది. సకాలంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన మేరకు అందిస్తున్నాం. ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో మరో 90 మందికి పోత్సాహకం అందించాల్సి ఉంది. నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. రాగానే లబ్ధిదారులకు అందిస్తాం.

- సుదర్శన్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి, మహబూబ్‌నగర్

కల్వర్టులు నిర్మించాలి

» అధికారులకు రైతుల విజ్ఞప్తి

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

» పెద్దపార్ల - ఉట్కూరు రహదారి పరిశీలన



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామ రైతులతో కలిసి రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : గాడిదల వాగుతో పాటు, మరో రెండు చిన్న వాగులపై కల్వర్టులు నిర్మించాలని పెద్దపొర్ల గ్రామ రైతులు, ప్రజలు అధికారులను కోరారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల గ్రామం నుంచి గాడిదల వాగు మీదుగా ఊట్కూరు వరకు రైతులు సొంతంగా తలాయింత డబ్బు పోగు చేసి రహదారిని నిర్మించుకున్నారు. ఈ అంశంపై 'చేయి చేయి కలిపారు.. పొలాలకు రోడ్డు వేశారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. పంచాయతీ రాజ్ ఏఈ అజయ్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో లక్ష్మారెడ్డి రహదారిని పరిశీ లించారు. పెద్దపొర్ల గ్రామ రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. రోడ్డుకు మధ్యలో ఉన్న మూడు వాగులపై కల్వర్టులు నిర్మించాలని వారు అధికారులను కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రహదారిని పరిశీలించినట్లు తెలిపారు.

రెండు రోజుల తర్వాత పంచాయతీరాజ్ డీఈతో కలిసి రహదారిని పరిశీలిస్తామని చెప్పారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి అంచనాలను సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

'భారత్‌మాల' రోడ్డు పనుల అడ్డగింత

» పరిహారం చెల్లించాలంటూ రైతుల ఆందోళన

» సైట్ ఇన్‌చార్జి హామీతో విరమణ



రైతుల ఆందోళనతో భారత్‌మాల రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

గట్టు, మే 27 (ఆంధ్రజ్యోతి) : భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి అవుతున్నా పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన భూములకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు, గంగిమాన్‌దొడ్డి రైతులు మంగళవారం రహదారి నిర్మాణ పనులను అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. పరిహారం చెల్లింపులో జాప్యంపై సైట్‌ఇన్‌చార్జి అఫ్జల్‌ను నిలదీశారు. తమకు న్యాయం జరిగే వరకు పనులను జరుగనిచ్చేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. పరిహారం విషయంపై కలెక్టర్‌ను కలుద్దామని, తాను కూడా వస్తానని రైతులకు నచ్చచెప్పినా రైతులు ఆందోళన విరమించలేదు. కచ్చితమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని పట్టుబట్టారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చచెప్పారు. చివరకు సైట్‌ఇన్‌చార్జి స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు.

సర్వేకు సహకరించాలి

» భూమిని కోల్పోయే రైతులకు నష్టపరిహారంతో పాటు, ఉపాధి కోసం సాయం అందిస్తాం

» రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

» తిప్రస్‌పల్లి, బాపూర్, పెద్దపొర్ల గ్రామాల్లో రైతుల పునరావాస గ్రామసభ



పెద్దపొర్ల గ్రామసభలో రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న రెవెన్యూ అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

ఊట్కూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ కోసం అధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద ఉన్న భూమి మొత్తం కోల్పోయి, ఇళ్లు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు, ప్రత్యామ్నాయంగా ఉపాధి కోసం ఆర్థిక సహాయం కూడా చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం పేట జిల్లా ఊట్కూర్ మండలంలోని తిప్రస్‌పల్లి, బాపూర్, పెద్దపొర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సభలో రైతుల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులు తమ వివరాలు ఇవ్వాలని అన్నారు. ఎవరికి ఎంత భూమి పోతున్నదో అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తారని, సర్వేకు సహకరించాలని కోరారు. కాగా, తిప్రస్‌పల్లి గ్రామంలో ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలని రైతులు కోరారు. పెద్దపొర్ల గ్రామంలో ఎకరానికి ఎంత నష్టపరిహారం ఇస్తారో తేల్చాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే పూర్తయిన తర్వాత కలెక్టర్, ఆర్డీవో నష్టపరిహారాన్ని చెబుతారన్నారు. ప్రస్తుతం పూర్తిగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయం, ఉపాధికి సహకారం ఎలా అందించాలనే దానిపై అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామసభల్లో తహసీల్దార్ చింత రవి, ఇరిగేషన్ అధికారులు కేతన్‌కుమార్, వెంకటప్ప, సర్వేయర్ రాజు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో పీయూ స్నాతకోత్సవం

» పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ

» వచ్చేనెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ

పాలమూరు యూనివర్సిటీ, మే 27 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని సెప్టెంబరు లేదా అక్టోబరులో నిర్వహించనున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కే ప్రవీణ తెలిపారు. యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది ఫిబ్రవరిలో 4వ స్నాతకోత్సవానికి నోటిఫికేషన్ వేసినట్లు తెలిపారు. కానీ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని తెలిపారు. తాజాగా స్నాతకోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్వర్ణ పతకాలు, పట్టాల కోసం అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారు కాకుండా, ఈ ఏడాది టాపర్లుగా నిలిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అందుకు వచ్చే నెల 16 వరకు గడువు ఉందని తెలిపారు. అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు, దరఖాస్తు ఫారం కోసం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పురుషోత్తం రెడ్డి



తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూసి ఆందోళన చెందుతున్న రైతు పరశురాం

వనపర్తి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి పోరాటాలు ఉద్రిక్తం చేస్తామని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని చందాపూర్‌లోని కల్లాల్లో తడిసి మొలకలొచ్చిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. తడిసి ధాన్యం చూసి ఆందోళన చెందుతున్న రైతు పరశురాంను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు బోనస్ అంటే రైతులను కల్లాల్లో కాపలా పెట్టడమే బోనస్ అని అర్థవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, చిన్న నరసింహ, బాలరాజు, సంపత్ కుమార్, డాకేష్, తిమ్మయ్య, ఎల్లస్వామి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి.. 8 రోజుల జైలు శిక్ష

మూసాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి 8 రోజుల జైలు శిక్ష విధించినట్లు మూసాపేట ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సంకలమద్దిలోని బంగ్లాగడ్డ కాలనీకి చెందిన మాల చంద్రాయుడు ఈ ఏడాది జనవరి 10న జాతీయ రహదారి వేములస్టేజీ వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 8 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



సదా మీ సేవలో..

అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.

సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

ఇంటర్వ్యూ.

శాంతిభద్రతలకు సహకరించాలి

- మహేందర్, ఎస్ఐ, వంగూరు



వంగూరు మే 27 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని, విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ మహేందర్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అనుమతి లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు ఇతర వాహనాలను పట్టుకొని డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ముఖ్యంగా ద్విచక్రవాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహ రిస్తున్నాం.

నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసు కుంటున్నాం. వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ప్రజలతో తత్సంబంధాలు కలిగి ఉండి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకంటాం.

న్యూస్ బాక్స్

మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు



మహానాడుకు తరలుతున్న టీడీపీ నాయకులు

కల్వకుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని కడప జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించే టీడీపీ మహానాడుకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పలువురు ఆ పార్టీ నాయకులు మంగళవారం బయల్దేరి వెళ్లారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు యాదిలాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు నరసింహ, పంచాక్షరి, శ్రీనాథ్, వజ్ర లింగం, తిమ్మయ్య, సత్తయ్య, మహేందర్ ఉన్నారు.

గ్రామసభ నిర్వహించాలని వినతి

పెంట్లవెల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎంగంపల్లి తండాలో గ్రామసభ నిర్వహించాలని మంగళవారం ఎంపీడీవో దేవేందర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామసభ నిర్వహించాలని 20 రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌కు వినతి పత్రం ఇచ్చిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించి గ్రామంలో సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు రాజు, గ్రామస్థులు అశోక్, మురళి, కురుమయ్య, రవీంద్ర, అశోక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

పెంట్లవెల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం అమావాస్య సందర్భంగా మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు లోకేష్ మొదటగా స్వామివారికి పంచామృతాభిషేకం, సిందూర లేపనం, ఆకు పూజ, కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా వచ్చిన భక్తులకు నీరడి రాజు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం

కల్వకుర్తి, మే 27 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అమావాస్య భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ సుభాషిణి హాజరై అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, కోశాధికారి జూలూరి వేణు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొండూరు కృష్ణయ్య, శ్రీనివాసులు, నాయకులు తరుణ్, రేవంత్, నితిన్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

అచ్చంపేట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తైందని అచ్చంపేట పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే చేసి అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించినట్లు స్థానిక ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలించి వివిధ కార్పొరేషన్ల బ్యాంకుల సమ్మతికి పంపించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకం కోసం అచ్చంపేట మండల పరిధిలోని అర్హులైన గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.

చివరి దశకు...

- ఊర్కొండలో ఆరేళ్లుగా కొనసాగుతున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు
- స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాలతో వేగవంతమైన పనులు
- ఈ విద్యాసంవత్సరం ప్రారంభించే అవకాశం



ఊర్కొండలో ప్రారంభానికి సిద్ధమవుతున్న కేజీబీవీ నూతన భవనం

ఊర్కొండ, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం నూతన భవనం పనులు చివరి దశకు చేరాయి. గత ప్రభుత్వం ప్రారంభమైన పనులు మందకొడిగా కొనసాగుతుండగా, ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆరేళ్లకు గాపై కొనసాగుతున్న కేజీబీవీ నూతన భవనం పనులు ఎట్టకేలకే చివరి దశకు చేరాయి. ఈ మండలానికి కేజీబీవీ మంజూరైనప్పటికీ వసతులతో కూడిన భవనం లేనందున కల్వకుర్తిలోని ఓ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా ఇరుకైన గదుల్లో విద్యాబో ధన, వసతి గృహం ఒకేచోట ఉండటం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టలేక నానా అవ స్థలుపడ్డారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరు నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూఏఐ నూతన కోర్సులు ప్రారంభించాలని, ఈ రెండు కోర్సుల్లో 40 మంది విద్యార్థుల చొప్పున ఉండాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో మన ప్రాంతంలో నిరుపేదలు సైతం మంచి కోర్సులు అభ్యసించడానికి అవకాశం రావడంతో విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనం త్వరలో ప్రారంభిస్తే విశాలమైన గదుల్లో ఇలాంటి కోర్సులు చదువుకోవడానికి ఆదరణ విద్యార్థుల నుంచి లభించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రూ. 3.5కోట్లతో భవనం పనులు కొనసాగుతున్నాయి. భవనం పనులు 90శాతానికి పైగా పూర్తయ్యాయని, వారం పది రోజుల్లో ప్లాస్టరింగ్ పూర్తయితే, రంగులు వేయడమే తరువాయి అని కాంట్రాక్టర్ అభిప్రాయపడ్డారు.

త్వరగా పనులు చేసి ప్రారంభించాలి



ఊర్కొండలో నిర్మాణం లో ఉన్న కేజీబీవీ భవనం పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ విద్యా సంవత్సరం ఇక్కడి నుంచి కొనసా గాలని జిల్లా ఉన్నతా ధికారులను కోరుతున్నాము. నూతన కోర్సులు ప్రారంభం దృష్ట్యా కల్వకుర్తి పట్టణంలో ఉన్న అద్దె భవనంలో ఇబ్బందిగా ఉంటుంది. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు పనులు పూర్తి చేసే దంగా చూడాలి.

- పాలే రమేష్, ఊర్కొండ

పనులు త్వరగా పూర్తి చేయాలని కోరాం

ఊర్కొండలో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ భవనం పనులు ఇంకా వేగవంతం చేసి రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరాం. ఈ విద్యా సంవత్సరం కొత్త కోర్సులు వచ్చాయి. అక్కడ అసౌకర్యమైన గదుల్లో బోధించడానికి ఇబ్బందిగా ఉంది. భవనం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే అందుబాటులోకి వస్తుందని ఆశ.

- శైలజ, ప్రత్యేక అధికారి, కస్తూర్బా బాలికల విద్యాలయం, ఊర్కొండ

జాతి నిర్మాణకర్త

జవహర్ లాల్ నెహ్రూ

- వర్ధంతిలో టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు



చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న జగదీశ్వరుడు

కొల్లాపూర్, మే 27(ఆంధ్రజ్యోతి) : భారత దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జాతి నిర్మాణ కర్త అని పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో వృద్ధులకు, చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్ రావు, నాయకులు వెంకటస్వామి, జుబేర్ ఖాన్, జమీల్‌ఖాన్, గోవింద్‌గౌడ్, రజకస్వామి పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి : భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కు మార్ అన్నారు. కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నాయకులతో కలిసి ఆనంద్‌కు మార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, దామోదర్‌గౌడ్, శ్రీను, ఆంజనేయులు, జమ్ముల శ్రీకాంత్, బి.శేఖర్, సైదులు యాదవ్, రామకృష్ణ, శ్రీధర్, జంగయ్యగౌడ్, పడకంటి వెంకటేశ్, రామకృష్ణ, ఉన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి

అచ్చంపేటటౌన్ : దేశానికి నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని పాల శీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు నర్సయ్య యాదవ్ అన్నారు. భారత తొలి ప్రధానమంత్రి నెహ్రూ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టనంలో నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరీశంకర్, రామనాథం, రాఘవులు, మహబూబ్ అలీ, గౌస్ పాషా, శ్రీనివాసచారి, లాలు యాదవ్, సీతారాం నాయక్,ఈశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

చారకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి) సమాజానికి కమ్యూనిస్టులు ఎంతో అవసరమని, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేసేది ఏకైక పార్టీ ఎర్రజెండా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చారకొండ, వంగూరు ఉమ్మడి మండలాల సీపీఐ 3వ మహాసభల సమావేశం సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. మతోన్మాద బీజేపీ కమ్యూనిస్టులపై నిరంకుశ పాలన కొనసాగిస్తోందని, వెంటనే వీటిని నిలువరించేందుకు కమ్యూనిస్టులు ఐక్యతో పోరాటం చేయాలని అన్నారు. ఆదివాసి ప్రజలను, మావోయిస్టులను చట్ట విరుద్ధంగా హత్యలు చేయడాన్ని తీవ్రంగా కండిస్తున్నామని, ఈ హత్యలన్నీ బీజేపీ చేసిన హత్యలేనని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు వార్ల వెంకటయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నూనే వెంకటేష్, గోపాల్, మల్లేష్, తిరుపతమ్మ, పరశురాం పాల్గొన్నారు.

● కందనూలు : హామీలు అమలు చేయకపోతే పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని మంగళవారం కుమ్మెర గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ మహాసభ సీతారాములు అధ్యక్షతన జరిగింది. జిల్లా సమితి సభ్యుడు కృష్ణాజీతో కలిసి హెచ్.ఆనంద్ జీ పాల్గొన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా బౌరమ్మ, సహాయ కార్యదర్శిగా కాజా, కోశాధికారిగా సీతారాములును ఎన్నుకున్నారు.

● తెలకపల్లి : ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తే చూస్తూ ఊరుకోబోమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులుగౌడ్ హెచ్చరించారు. గతంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలకు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. మంగళవారం మండలంలోని గట్టురాయిపాకుల సీపీఐ మహాసభ జరగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని పెద్దపల్లి, గౌరెడ్డిపల్లి, గట్టురాయిపాకుల గ్రామాల్లో ప్రజా స్థానిక సంస్థల సీపీఐ అభ్యర్థులుగా పోటీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి రవీందర్, గొడుగు విష్ణు, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

జైభీం అవార్డు గ్రహీత జెట్టి ధర్మరాజుకు ఘన సన్మానం



జెట్టి ధర్మరాజును సన్మానిస్తున్న బహుజన ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జైభీం అవార్డు గ్రహీత, బహుజన మేధావి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజును ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కవులు, బహుజన ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధర్యంలో జెట్టి ధర్మరాజును శాలువా, పూల మాలలతో సన్మానించారు. దశాబ్దాలుగా దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను గుర్తించిన స్థానిక ఎంపీ మల్లు రవి ఇటీవలే రంగారెడ్డి జిల్లా ఆ మనగల్లులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను జైభీం అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళిత, బహుజనులపై జరుగుతున్న దాడులు, అక్రమాలను ముందుండి ఎదుర్కొన్న మానవతావాది అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగ సంఘాల నాయకులు గుడిపల్లి నిరంజన్, కొంగరి జానయ్య, కవులు వనపట్ల సుబ్బయ్య, ఎదిరేపల్లి కాశన్న, సీనియర్ జర్నలిస్టు మోహన్, ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో దశాబ్ది యోగా ఉత్సవాలు

కొల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆశా కార్యకర్తలకు యోగా విధివిధానాలను వివరిస్తూ యోగాపై ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జీయుడి పెంట్లవెల్లి మెడికల్ ఆఫీసర్ డా.ఎం.జ్యోత్స్న దేవి, యోగా ఇన్‌స్ట్రక్టరు శంకర్ గౌడ్, ఆశా కార్యకర్తలకు యోగాపై పూర్తి అవగాహన కల్పించి యోగా ద్వారా మనిషి నిత్య జీవితంలో ఎంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతీ రోజు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, దాని ద్వారా మనిషి మానసికంగా, శారీరకంగా దృఢంగా స్థిరంగా ఉంటారని వారు వివరించారు. కార్యక్రమంలో ఫయూమ్, రవీందర్, భారతి, రహీం, మునిసా బేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు : సీఐ



వెల్దండలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ, ఏవో

వెల్దండ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఎస్ఐ కురుమూర్తి, ఏవో శోభారాణిలతో కలిసి సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలోని నిల్వలను, రిజిస్టర్‌లను వారు పరిశీలించారు. దుకాణాలలో సర్టిఫైడ్ విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● బల్మూరు : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధి కారి కావేటి నరేష్, స్థానిక ఎస్ఐ ర మాదేవిలు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కొండనాగుల ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం వద్ద టాస్క్‌ఫోర్సు తనిఖీ నిర్వహించినట్లు వారు తెలిపారు.



పెద్దకొత్తపల్లి : రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏవో శిరీష

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

చారకొండ : ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని వ్యవసాయశాఖ అధికారి తనూజరాజ్ అన్నారు. మండంలోని జూపల్లిలో కొనసాగుతున్న మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదును తనూజరాజ్ పరిశీలించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో సుష్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పొందండి

పెద్దకొత్తపల్లి : ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే.శిరీష పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్వకోల్, గంట్రావుపల్లి, పెద్దకొత్తపల్లి, ముష్టిపల్లి, చిన్నకార్పాముల గ్రామాలకు చెందిన రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తాకు సబ్సిడీపై రూ.2137.5లు చెల్లించి రైతులు పొందవచ్చని సూచించారు. రైతులు తమ పట్టా పాస్ బుక్, ఆధార్ జిరాక్స్ పత్రాలతో వచ్చి పొందవచ్చని వ్యవసాయ అధికారి కే.శిరీష తెలిపారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. 18వ వార్డు కౌన్సిలర్ అప్పశివ మునిసిపాలిటీ పరిధిలో పదవ తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో 500 మార్కులుపైన సాధించిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించి వారిని మరింత ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. నల్లమల ప్రాంతంలోని విద్యార్థులకు సీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయ కులు గోపాల్ రెడ్డి, కాశన్న యాదవ్, గౌరీశం కర్, కొయ్యల శ్రీనివాసులు, నర్సయ్య యాదవ్ కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కోడేరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లుల్ని చెల్లించకపోతే దశల వారీగా పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి.రవి, వెంకటమ్మ, వై.రవి, పి.శివశంకర్, డ్యాగ శివుడు, వెంకటయ్య, లక్ష్మయ్య, బుచ్చన్న పాల్గొన్నారు.

అంబేడ్కర్ సతీమణి రమాబాయికి ఘన నివాళి



జిల్లా కేంద్రంలో రమాబాయి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ జాతర కమిటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి 90వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలో అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో రమాబాయి చిత్ర పటానికి బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం విజయ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని దళిత, బహుజనుల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన పోరాటంలో ఆయన జీవిత భాగస్వామిగా రమాబాయి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జాతర కమిటీ సభ్యులు నరిగె నరేందర్, శ్రీనివాస్, శివశంకర్, ప్రశాంత్, కల్మూరి శేఖర్ పాల్గొన్నారు.

బస్తాకు రెండు కిలోల వడ్లు తీస్తే ఎలా?

- లబోదిబోమంటున్న రైతన్నలు



నాగులపల్లి తండాలో వడ్లు తూకం వేసి డీసీఎంకు ఎత్తుతున్న హమాలీలు

కోడేరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కాంటా వేసి లారీలతో మిల్లులకు తరలించగా మిల్లుల యజమానులు 40కిలోల బస్తాకు రెండు కిలోల చొప్పున కట్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నాగులపల్లి తండాకు చెందిన రైతులు మీటు నాయక్, లక్ష్మి, బాలునాయక్, రఘు నాయక్ మాట్లాడుతూ ప్రతీ 40 కిలోల బస్తాకు రెండు కిలోల చొప్పున కట్ చేస్తామని, అయితేనే లోడ్ తీసుకుంటమని, లేకుంటే వాపసు తీసుకపొమ్మని అనడంతో రైతులు లబోదిబో మంటూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నట్లు వారు తెలిపారు. ఈ రైతులందరూ 450 బస్తాల ధాన్యాన్ని లారీలో లోడ్ చేసి కల్వకుర్తి మిల్లుకు తరలించగా యజమానులు బస్తాకు అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని, మార్కెట్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా మైనార్టీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ ఎన్నిక

కొల్లాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ ఎంప్లాయీస్, వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్ సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా మైనార్టీ ఉద్యోగుల, వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఖాజా మొయినుద్దీన్, జిల్లా అధ్యక్షుడిగా ఎండి సలీం, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎండి ముజీబ్ ఘోరి, ఎండి డా.సిరాజుద్దీన్, ఎండి ముజఫర్, ఉపాధ్యక్షులుగా సిరాజ్, షాకీర్ పాషా, ఆరీఫ్, కోశాధికారిగా ఎండి హుస్సేన్, జిల్లా మహిళా ఉద్యోగుల వర్కర్స్ అసో సియేషన్ ఉపాధ్యక్షులుగా జహీరాబేగం, కార్య దర్శిగా హబీబున్నీసాబేగం, ప్రధాన కార్య దర్శిగాలతీఫ్, సహాయ కార్యదర్శులుగా సలీం, నిరంజన్, ఖాదర్ పాషా, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఖాజా, యూనుస్, ఇద్రిస్ కార్యదర్శులుగా సజీద్ పాషాగౌస్, బషీర్, న్యాయ సలహా దారులుగా జహంగీర్, కార్యవర్గ సభ్యులుగా ఉబైద్, ఖాజాలతో కూడిన జిల్లా మైనార్టీ ఉద్యోగుల వర్కర్స్ కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారూఖ్ హుస్సేన్ పేర్కొన్నారు. సంఘం అభ్యున్నతికి పాటుపడతామని అన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

తిమ్మాజిపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : హోలీ శాలెం చర్చి తిమ్మాజిపేట వారి సహకారంతో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ జయరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని చర్చి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా 370మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు రక్త పరీక్షలు 50 మందికి. ఎక్స్‌రే 12మందికి ఈసీజీ పరీక్షలు రాశారు. 120మందికి కంటి పరీక్షలు నిర్వహించి 49మందికి గాను అద్దాలు అందజేశారు. వైద్యులు భారత్ స్వాతి భక్తసింగ్ దంత వైద్యులు మనోజ్ఞ కంటి వైద్య నిపుణులు సంపత్ సిబ్బంది స్వామి, కుసుమ, రవి, రాకేష్, చర్చి చైర్మన్ దేవదాస్, అధ్యక్షులు దానం బాలరాజు, ప్రసాద్, విజయ్, రాహుల్, రవి, రాజు పాల్గొన్నారు.

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

- ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి - టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట



చెన్నపురావుపల్లిలో బడిబాట కార్యక్రమం గురించి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని చెన్నపురావుపల్లిలో టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ గ్రామంలో మూతపడిన పాఠశాలను వెంటనే తెరవాలని, దీనికోసం ప్రత్యేకంగా ఒక టీచర్‌ను కేటాయించామని దీనికి గ్రామస్థుల సహకారం కావాలని కోరారు. ఎలాంటి సహాయ సహకారాలైనా మండల విద్యాశాఖ నుంచి అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామంలో పాఠశాల ప్రారంభమైన వెంటనే నెలలోపు తన సొంత ఖర్చు నుంచి విద్యార్థులకు టై, బెల్టులు ఉచితంగా అందిస్తానని ఎంఈవో తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ మాట్లాడుతూ గ్రామాలల్లో పాఠశాలలు దేశానికి పట్టుగొమ్మలని, మన ఊరు మన బడిని మనమే కాపాడుకోవాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ గౌస్‌బాషా, డి.మల్లయ్య, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి వి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పవన్, కిరణ్, కార్తీక్, తిరుపతయ్య, సీఆర్పీ రాముయాదవ్ పాల్గొన్నారు.